
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 28 జూలై 2025



# మళ్లీ వ్యవసాయ యాంత్రీకరణ



- 2025-26 ఆర్థిక సంవత్సరానికి పథకం వర్తింపు
- కొత్త మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- ఆగస్టు 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాకు 2,246 యూనిట్లు, రూ.74.31 లక్షలు మంజూరు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అనుసరించే దిశగా వచ్చిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆరేళ్ల తరువాత మళ్లీ రైతుల్లో ఆశలు కల్పించింది. గతంలో అమల్లో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2016- 17 అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. మళ్లీ ఈ పథకాన్ని ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి యాసంగి వరకు పూర్తిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలతో జీవో నంబర్ 234ను రెండు రోజుల క్రితం జారీ చేసింది. 2025-26 సంవత్సరానికి ఈ పథకాన్ని వర్తింపచేసే విధంగా నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేందుకు అడుగులు వేసింది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు 198యూనిట్లకు రూ.58.84 లక్షలు మంజూరుచేశారు. కానీ ఆర్థిక సంవత్సరం చివరి మాసం మార్చిలో పథకం వర్తింపచేయడానికి ప్రభుత్వం పూనుకోవడంతో రైతులకు యాంత్రీకరణ అందించలేక పోయారు. ఈసారి అలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తగా చర్యలకు పూనుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రూపొందించిన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాన్ని రైతులకు అందించడానికి 2025-26 సంవత్సరానికి ఈ పథకాన్ని వర్తింపచేసే విధంగా యాంత్రీకరణ కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాకు 2246 యూనిట్లు, రూ.74.31 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. యాంత్రీకరణ పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, జనరల్ రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. దానికి అనుగుణంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వ్యవసాయ అధికారులు యాంత్రీకరణ సన్నాహాలు మొదలుపెట్టారు.

### సెప్టెంబరు 7 నుంచి పరికరాల పంపిణీ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రైతుల నుంచి ఆగస్టు 5 నుంచి 15 తేదీ వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. గతంలో దరఖాస్తులు చేసిన రైతులను సైతం పరిగణనలోకి తీసుకొని దరఖాస్తులకు సంబంధించి నివేదికను కలెక్టర్‌కు అందిస్తారు. కలెక్టర్ ఆగస్టు 16 నుంచి 20 తేదీ వరకు పరిశీలిస్తారు. దరఖాస్తు తిరస్కరిస్తే అందుకు కారణాలను రైతులకు తెలియజేస్తారు. ఆగస్టు 21 నుంచి 27వ తేదీ వరకు యాంత్రీకరణకు ఎంపిక చేసిన రైతుల నుంచి డీడీలు తీసుకుంటారు. ఆగస్టు 27నుంచి సెప్టెంబర్ 5 తేదీ వరకు లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు ఇస్తారు. సెప్టెంబర్ 7నుంచి 17 తేదీ వరకు రైతులకు పరికరాల పంపిణీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించారు.

### 15 రకాల యాంత్రీకరణ పరికరాలు

వ్యవసాయరంగంలో ఆధునికత తీసుకువచ్చే దిశగా ఉమ్మడి రాష్ట్రంలో యాంత్రీకరణ పథకం కొనసాగింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొద్దిరోజులు కొనసాగినా గత ఆరేళ్లుగా నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగి నుంచి యాంత్రీకరణ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో నిర్ణయం తీసుకోవడంతో అందించలేకపోయారు. రైతుల నుంచి వ్యవసాయ పరికరాల కోసం వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో...

- మిగతా 8లో

## జీపీవో, లైసెన్స్‌డ్ సర్వేయర్ ఎంపిక పరీక్షలు ప్రశాంతం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జీపీవో, లైసెన్స్‌డ్ సర్వేయర్ అభ్యర్థుల ఎంపిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని గీతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీపీఓ, లైసెన్స్ సర్వేయర్ అభ్యర్థుల ఎంపిక పరీక్షలు జరగాయి. పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరీక్ష నిర్వాహణ తీరును కలెక్టర్ నిశితంగా పరిశీలించి అభ్యర్థుల హాజరుపై ఆరా తీశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకుజరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 39 మంది అభ్యర్థులకు గాను 35 మంది హాజరుకాగ నలుగురు గైర్హాజరు అయ్యారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన లైసెన్స్ సర్వేయర్ థియరీ పరీక్షకు 156 మంది అభ్యర్థులకు 141 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరైన్నారు. మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు లైసెన్స్ సర్వేయర్ అభ్యర్థులకు సెకెండ్ సేషన్ ప్లాటింగ్ పరీక్షకు 156 మంది అభ్యర్థులకు గాను 139 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరైన్నారు. పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, సీపీఓ శ్రీనివాసచారి, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

## గెరువిచ్చిన వాన.. జిల్లాలో 30.2 మిల్లీమీటర్ల వర్షం

సిరిసిల్ల జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా కురిసిన వర్షాలు ఆదివారం గెరువిచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం ఉదయం వరకు 30.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పొద్దంతా వర్షం కురువలేదు. జిల్లా లోటు వర్షపాతం నుంచి సాధారణ వర్షపాతానికి చేరుకుంది. ఆదివారం ఉదయం వరకు నమోదైన వర్షపాతంలో రుద్రంగిలో 34.0మిల్లీమీటర్లు, చందుర్తిలో 36.5 మిల్లీమీటర్లు, వేములవాడ రూరల్‌లో 37.9 మిల్లీమీటరు, బోయిన్‌పల్లిలో 24.7మిల్లీమీటర్లు, వేములవాడలో 31.5 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 24.4మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 24.9 మిల్లీమీటర్లు, వీర్నపల్లిలో 19.1 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 25.5 మిల్లీమీటర్లు, గంభీరావుపేటలో 33.9 మిల్లీమీటర్లు. ముస్తాబాద్‌లో 36.9 మిల్లీమీటర్లు. తంగళ్ళపల్లిలో 28.6 మిల్లీమీటర్లు. ఇల్లంతకుంటలో 24.7మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుత సీజన్లో సాధారణ వర్షపాతం 328.5 మిల్లీమీటర్ల కాగా 340.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చందుర్తి, వేములవాడ రూరల్, బోయిన్‌పల్లి, వేములవాడ, సిరిసిల్ల, వీర్నపల్లి, ఎల్లా రెడ్డిపేట మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో సాధారణంకంటే అత్యధిక వర్షపాతం, రుద్రంగిలో లోటు వర్షపాతం నమోదైంది.

## భక్తిశ్రద్ధలతో ముక్కోటి కుంకుమార్చనలు..



ముక్కోటి కుంకుమార్చనలో మహిళలు

సిరిసిల్ల టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప దేవాలయంలో ముక్కోటి కుంకమార్చనలు కొనసాగుతున్నాయి. శ్రీ రాజ శ్యామల, శ్రీవారహిసహిత, శ్రీలలిత త్రిపురసుందరి, శ్రీఅష్టలక్ష్మి సహిత, శ్రీలక్ష్మీ నారాయణ దేవాలాయాల 4వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న ఆలయ ఆవరణలో ముక్కోటి కుంకుమార్చనలను ప్రారంభించారు. ఆదివారంతో ముక్కోటి కుంకుమార్చనలు ఎనిమిదవ రోజుకు చేరుకుంది. ప్రతిరోజు మహిళలు భక్తి శ్రద్ధలతో ముక్కోటి కుంకుమార్చనలో పాల్గొంటున్నారు. ఈనెల 29న ముక్కోటి కుంకుమార్చనలు ముగియనున్నాయి. సోమవారం దేవాలయం ఆవరణలో రాచర్ల చంద్రకాంత ఘనపాఠి, వేద ఘనపాఠి బ్రాహ్మన పండితుల ఆధ్వర్యంలో శ్రీరుద్రసహిత నవ చండీ పారాయణం, శ్రీ రుద్ర సహిత నవ చండీహోమం నిర్వహిస్తున్నారు. హోమం అనంతరం భక్తులకు మహా అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సభ్యులు కోరారు.

## ఎమ్మెల్యేను కలిసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు

ఇల్లంతకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో ఆదివారం కలిసి సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు అయ్యాయని తమకు ఇంతవరకు ప్రొడీంగ్ కాపీలు ఇవ్వలేదని సూచించారు. ప్రభుత్వం స్పందించి పత్రాలు ఇవ్వాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, నాయకులు కిషోర్‌గౌడ్, తిరుపతి, రంగు రజనీకాంత్, మహేష్, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

## కేజీబీవీలో సమయానికి అందని భోజనం..?

వీర్నపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ మధ్య సమన్వయలోపంతో విద్యార్థులకు సమయానికి భోజనం అందడంలేదని సమాచారం. ఆదివారం సెలవుదినం కావడంతో విద్యార్థులను చూసేందుకు వెళ్లిన తల్లిదండ్రుల ముందు కొందరు విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులకు ఉదయం అందించాల్సిన టిఫిన్స్ మధ్యాహ్నం, మధ్యహ్న భోజనాన్ని సాయంత్రం అందించినట్లు తల్లిదండ్రులకు తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.

## అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



సీఎం రమేష్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 27 (ఆంధ్రప్రదేశ్) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసూ ఆదివారం జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆంధ్రప్రదేశ్ అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఫ్లెక్సీ దహనం చేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. ఆంధ్ర నాయకుల దృష్టి ఎప్పుడు తెలంగాణపైనే ఉంటుందని తెలంగాణకు నష్టం చేయాలనే ఆలోచనలతో ఉన్నారని ఆరోపించారు. మళ్లీ తెలంగాణలో పాగ వేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకొని కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మట్టె శ్రీనివాస్, ముద్దం అనిల్‌గౌడ్, కోడం వెంకటేశం, ఎస్‌కే అఫ్రోజ్, హరీష్, రాము, పవన్ పాల్గొన్నారు.

# రాజీవ్‌నగర్‌లో పారిశుధ్య లోపం..

- డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగునీరు.. - వర్షాలకు అవస్థలు పడుతున్న ప్రజలు



రాజీవ్‌నగర్‌లో రోడ్డుపక్కన నిలిచిన మురుగునీరు



రాజీవ్‌నగర్‌లో వర్షానికి రోడ్డుపై చేరిన నీరు

సిరిసిల్ల రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లో పారిశుధ్యం లోపించింది. మురుగుకాలువలు, సిమెంట్ రోడ్లు లేకపోవడంతో మురుగు నీరు చేరుతోంది. వర్షాలకు ఇళ్ల చుట్టూ వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాజీవ్‌నగర్ సిరిసిల్ల పట్టణానికి అనుకోని ఉంటుంది. సిరిసిల్లలోని మరమగ్గాల పరిశ్రమలలో పనిచేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు రాజీవ్‌నగర్‌లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. అయితే 18 సంవత్సరాల క్రితం రెవెన్యూ అధికారులు అక్కడి ప్రభుత్వ భూములను గుడిసెలు వేసుకున్న కార్మిక కుటుంబాలకు అందించింది. గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామజ్యోతిలో భాగంగా అప్పటి ఉమ్మడి జిల్లా కరీంనగర్ కలెక్టర్ నీతూకుమారి ప్రసాద్ దత్తత తీసుకొని గ్రామంలోని అన్ని వార్డులను పరిశీలించి అభివృద్ధి కోసం నిధులు మంజూరుచేయగా ప్రధాన రహదారులు నిర్మించారు. అయితే గ్రామపంచాయతీగా ఉన్న రాజీవ్‌నగర్‌ను సిరిసిల్ల మున్సిపల్ విలీనం చేసి ఆ గ్రామాన్ని రెండు వార్డులుగా విభజించారు. ఆయా వార్డులకు కౌన్సిలర్లుగా అధికార పార్టీకి చెందిన వారు గెలుపొందినా మున్సిపల్ నుంచి అభివృద్ధి పనులకు నిధులు లేక సిమెంట్ రోడ్లు, మురికికాలువలను నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదమయంగా మారిపోతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ప్రత్యేక దృష్టి సారించి రాజీవ్‌నగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### దుర్గంధంతో అవస్థలు పడుతున్నాం..

- బుర్ర మల్లికార్జున్ గౌడ్, మాజీ ఎంపీటీసీ, రాజీవ్‌నగర్



రాజీవ్‌నగర్‌లో ఇళ్ల మధ్యనే మురుగు నీరు నిల్వ ఉంది. దాంతో వచ్చే దుర్గంధంతో అవస్థలు పడుతున్నాం. మురికికూపం వల్ల దోమలు పెరిగి నిత్యం పిల్లలు అనారోగ్యాలకు గురవుతున్నారు. వర్షానికి రోడ్లన్నీ బురదమయంగా మారిపోయాయి. గ్రామంలోని ప్రతి వార్డులో మురికి కాలువలు నిర్మించాలి.

### మున్సిపల్ అధికారులుపట్టించుకోవడం లేదు

- గొల్లపల్లి బాలయ్యగౌడ్, సిరిసిల్ల మున్సిపల్ మాజీ కో-అప్షన్ సభ్యుడు



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఇదివరకే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకవెళ్లాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా చర్యలు చేపట్టాలి.

## గిరిజన ఎస్ఐలకు సన్మానం



గిరిజన ఎస్ఐలను సన్మానిస్తున్న బంజారా సంఘం నాయకులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏఎస్ఐ నుంచి ప్రమోషన్ పొందిన గిరిజన ఎస్ఐలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బంజారా సంఘం నాయకులు ఆదివారం సన్మానించారు. ఉమ్మడి కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మారుమూల ప్రాంతానికి చెందిన మాలోతు మోతిరాం నాయక్, ఇస్లావత్ శంకర్ నాయక్, భూక్య రామ్మూర్తి నాయక్, గుగులోతు లక్పతి నాయక్ అనే నలుగురు గిరిజన ఎస్ఐలు పదోన్నతి పొందడం సంతోషకరమని వారు తెలిపారు. ఎస్ఐలను శాలువాలతో సన్మానించి అభినందించారు. యువత వీరిని స్పూర్తిగా తీసుకొని పరిక్షల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్య నాయక్, హరిదాస్ నాయక్, రవిలాల్, తిరుపతి, రాంచందర్ నాయక్, సకారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- గోశాల నుంచి 85 జతల కోడెల పంపిణీ



రైతుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

7

## దివ్యాంగులకు పెన్షన్ డబ్బులు పెంచి ఇవ్వాలి..

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

7



మంద కృష్ణ మాదిగను సన్మానిస్తున్న దివ్యాంగులు

## మట్టి టిప్పర్ పట్టివేత

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), జూలై 27 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను ఎల్లారెడ్డిపేట పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కోరుట్లపేట నుంచి బొప్పాపూర్ వైపు వస్తున్న మట్టి టిప్పర్‌ను పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఆపి డ్రైవర్ వినోద్‌ను అనుమతిపత్రాలు చూపాలని కోరడంతో లేవని తెలిపాడు. దీంతో మట్టి లోడుతో ఉన్న టిప్పర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు యజమాని సురేందర్, డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోతిరాం తెలిపారు.

## మూడు కేజీవీల్స్ ట్రాక్టర్ల పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేజీవీల్స్‌తో రోడ్డుపై నడుపుతున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని మీర్జంపేట గ్రామానికిచెందిన కటకం లక్ష్మణ్ రావు, మల్యాల గ్రామానికి చెందిన స్వప్న, సిద్దార్థ ట్రాక్టర్‌లను పట్టుకున్నామని తెలిపారు. ట్రాక్టర్లయాజమానులు కేజీవీల్స్‌తో రోడ్డుపై ప్రయాణం చేస్తే చట్టపరమైన చర్యలుతీసుకుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

# మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు



**నేటి నుంచి ఆగస్టు 3వరకు నిర్వహణ**

మంథని, జూలై 27: భూమి కోసం.. భుక్తి కోసం.. పీడిత ప్రజల విముక్తి కోసం.. సీపీఐ మావోయిస్టు దశాబ్దాలుగా ప్రజాపోరు సాగిస్తోంది. ప్రజా గెరిల్లా యుద్ధంలో నెలకొరిగిన వీరులను స్మరించుకునేందుకు సీపీఐ మావోయిస్టులు యేటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తోంది. మీ త్యాగ ఫలం.. మీ కర్మ ఫలం.. వృథాకాదు.. ఎర్ర జెండా సాక్షిగా.. అంటూ నివాళులర్పించనుంది.

**● చారుమజుందార్, కన్హాయ్ ఛటర్జీల స్మృతిలో..**

విప్లవ పితామహుడు చారుమజుందార్ పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా



సిలుగూరిలోని నక్సల్బరి గ్రామంలో విప్లవోద్యమాలకు బీజాలు నాటి 1972 జూలై 28న అమరుడయ్యారు. 1982 జూలై 18న మరో విప్లవ నాయకుడు కన్హాయ్ ఛటర్జీ పోరుబాటలో మృత్యువాడపడ్డారు. వీరిద్దరి స్మృతిలో అమరవీరుల త్యాగాలను స్మరించుకునేందుకు సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తోంది.

పోరాటాల వారసత్వాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పునికి పుచ్చుకుంది. మంథని, పెద్దపల్లి, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజురాబాద్, జమ్మికుంట, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీల అరాచకాలపై ప్రజలు తిరగబడ్డారు. గడీలపై దండ యాత్రలు చేయడంతోపాటు జగిత్యాల జైత్రయాత్రతో పోరాటాల ఖిల్లా చరిత్రకెక్కింది. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలకు సవాల్ విసురుతున్న సీపీఐ మావోయిస్టు పార్టీకి సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి దశాబ్దాల కాలంగా ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత జగిత్యాల) బీర్‌పూర్ గణపతి స్వగ్రామం. మూడున్నర దశాబ్దాలకుగా పైగా సాగుతున్న విప్లవోద్యమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అనేక మంది విప్లవవీరులు నెలకొరిగారు.

**● అడవులకే పరిమితమైన వారోత్సవాలు..**

దండకారణ్యంలో నిరంతరం పోలీసు బలగాలు దాడులు.. వరుస ఎన్‌కౌంటర్.. ప్రాణ నష్టం, పెరిగిన ఇన్‌ఫార్మర్, అత్యాధునిక నెట్‌వర్క్.. రిక్రూట్‌మెంట్‌కు ఆదరణ కరువుకావడంతో కొద్ది సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలపాలను కేవలం అటవీ ప్రాంతాలకే పరిమితం చేశాయి. యేటా తమకు పట్టున్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని అడవుల్లోనే మావోయిస్టుల అమర వీరులకు తాత్కాలికంగా స్తూపాలు నిర్మించి నివాళులర్పిస్తున్నారు.

**● అన్నల అలజడి లేని అడవులు..**

దశాబ్దంన్నర కాలంగా జిలాల్లో మావోయిస్టు దళాల కదలికలు పూర్తిగా కనుమరుగయ్యాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాలకు మకాం మార్చారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో సైతం మావోయిస్టుల కదలికలు కానరాలేదు. దీంతో గతంలో విధ్వంస, హింసాత్మక సంఘటనలతో అట్టుడికిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫ్రీజోన్‌గా మారింది.

**● త్యాగాల చిహ్నాలుగా అమరుల స్తూపాలు..**



బేగంపేటలో మావోయిస్టు అమరవీరుల స్మారక స్తూపం

అమరుల త్యాగాలకు చిహ్నంగా హుస్నాబాద్‌లో ఆసియాలో రెండో అతి పెద్ద స్తూపం, కమాన్‌పూర్ మండలం బేగంపేట, భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంతోపాటు మరి కొన్ని చోట్ల స్మారక స్తూపాలను పీపుల్స్‌వార్ (మావోయిస్టు) నాయకత్వాలు నిర్మించాయి. హుస్నాబాద్ స్తూపాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పేల్చి వేయగా ప్రస్తుతం బేగంపేట, మహాముత్తారం స్తూపాలు అమరుల త్యాగాలకు చిహ్నంగా దర్శనమిస్తున్నాయి.

## అన్నవరం దేవేందర్‌కు సినారె పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అన్నవరం దేవేందర్

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌కు చెందిన కవి అన్నవరం దేవేందర్ ఆదివారం భువనగిరిలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి రచయితల సంఘం ఆధ్వర్యంలో సినారె సాహిత్య పురస్కారం అందుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణకుమార్ పురస్కారం ప్రదానం చేశారు. పాత పది జిల్లాల నుంచి ఎంపికైన కరీంనగర్ నుంచి అన్నవరం ఒకరు. లక్ష్మణకుమార్ మాట్లాడుతూ కవులు ప్రజలు, సమాజం, దేశం కేంద్రంగా రచనలు చేయాలని దేవులపల్లి రామానుజరావు వ్యాఖ్యలను ఉటకించారు. భాషాభివృద్ధి కోసం సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏళ్ల జ్ఞాపకం

**● మానకొండూర్‌లో అ'పూర్వ' సమ్మేళనం**



మానకొండూర్‌లో ఒకచోట కలుసుకున్న 1975-76బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

మానకొండూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఐదు దశాబ్దాల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు మళ్లీ ఒక్క చోటికి చేరారు. చెరిగిపోని తమ స్నేహాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చుకున్నారు. మానకొండూర్ జడ్పీ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదివిన 1975-76వ బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల అనంతరం మళ్లీ కలుసుకోవడంతో ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న నాటి చిలిపి చేష్టలు, అల్లరి పనులతోపాటు ఆనాటి అనుభూతులు పంచుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు మృతిచెందిన గురువులు, తోటి విద్యార్థుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## యువకుడి బలవన్మరణం

వీణవంక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన ఊట్ల పవన్‌కళ్యాణ్(25) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పవన్‌కళ్యాణ్ టెంట్‌హౌజ్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య పనికి సరిగా వెళ్లకుండా మద్యానికి బానిసై ఆర్థికంగా ఇబ్బందులుకు గురయ్యాడు. ఈక్రమంలో మనస్థాపానికి గురై ఇంట్లోని దూలానికి చీరతో ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పవన్‌కల్యాణ్ తల్లి ఊట్ల రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**● 21 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం**

పెద్దపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి డీసీపీ కరుణాకర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటు పడి అత్యాశతో గంజాయికి బానిసైన వారికి రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసకున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం బసవరాజుపల్లెకు చెందిన అంగడి సాంబయ్య బిల్డింగ్ సీలింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. వచ్చే డబ్బులు అవసరాలకు, జల్సాలకు సరిపోక సులువుగా డబ్బు సంపాదించాలని ఒడిశాకు చెందిన రమేష్ సహాయంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొని ఆటో ఇంజన్ కింద భాగంలో ప్యాక్ చేసుకొని మంచిర్యాలలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 27 న నిందుతుడు ఆటోలో గంజాయి ప్యాకెట్లతో మంచిర్యాలకు వెళ్తుండగా పెద్దపల్లి శివారులో ప్లై ఓవర్ దగ్గర పోలీస్ ల తనిఖీలో పట్టుపడ్డాడు. రూ. 21 లక్షల విలువ చేసే 41.88 కిలోల గంజాయితోపాటు ఆటోను స్వాదీనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ కె.ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐలు లక్ష్మణ్ రావు, నరేష్, కోటేశ్వర్, హెడ్ కానిస్టేబుల్లు అనంతరెడ్డి, స్వామి కానిస్టేబుల్స్ ప్రభాకర్, సతీష్, రాజు అనిల్ కుమార్ లను పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ అభినందించారు.

## పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్ర ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పైడి జయరాజ్ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. తెలం గాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసే తెలంగాణ సన్మాన్-2025 పురస్కారాల్లో భాగంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.



అతిథులు, ఇతర పురస్కార గ్రహీతలతో పొన్నం రవిచంద్ర

## చికిత్స పొందుతూ మున్సిపల్ కార్మికుడి మృతి



ప్రవీణ్ (ఫైల్)

పెద్దపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగంపల్లి పదో వార్డుకు చెందిన మామిడి పల్లి ప్రవీణ్ సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మామిడిపల్లి ప్రవీణ్ ఆర్థిక ఇబ్బందులతో మూడు రోజులక్రితం పురుగులమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు శనివారం ప్రవీణ్ మృతి చెందాడు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

## జనంలోకి కొండ చిలువలు

**● హుజూరాబాద్, మానకొండూర్‌లలో ప్రత్యక్షం**
**● పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేసిన ప్రజలు**



హుజూరాబాద్‌లో, మానకొండూర్‌లో పట్టుకున్న కొండ చిలువలతో ప్రజలు

హుజూరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. సుమారు పది అడుగుల కొండచిలువ కనబడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన అబ్బుల్ సంఘటన స్థలానికి చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అటవీ ప్రాంతంలో కొండ చిలువను వదిలేయాలని చెప్పడంతో గుట్టల్లో వదిలేశారు.

**మానకొండూర్:** మానకొండూర్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలోని ఓఇంటిలో ఆదివారం రాత్రి గ్రామస్థులు కొండచిలువను పట్టుకున్నారు. ఇంటి ఆవరణలోని చెట్టుపై ఉన్న కొండచిలువను చూసిన ఇంటిలోని ఓ మహిళ కేకలు వేసింది. కాలనీవాసులు అక్కడికి చేరున్నారు. శ్రీనివాస్ అనే యువకుడు కొండ చిలువను పట్టుకొని ఈదులగట్టెపల్లిలో గల జాలగుట్ట వద్ద వదిలిపెట్టాడు. కొండచిలువ సుమారు ఆరు అడుగులకు పైనే ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు.

## యువకుడి అనుమానాస్పద మృతి



పొలంలో పడి ఉన్న మనోహర్ మృతదేహం

వీర్నపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు జోగుల మనోహర్(35) వరి పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించిన ఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లి శివారులోని సీతారాం నాయక్ తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గర్జనపల్లికి చెందిన జోగుల చంద్రయ్య-నర్సవ్వల చిన్నకుమారుడు మహేష్‌పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి నర్సవ్వకు మతిస్థిమితం సరిగాలేక ఇంటి వద్దనే ఉంటూ జీవిస్తుంది. పెద్ద కుమారుడు మనోహర్ పరిస్థితి కూడా అదే విధంగా మతిస్థిమితం సరిగా లేక రోడ్ల వెంబడి తిరుగుతుంటాడు. తండ్రిచంద్రయ్య ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మనోహర్ శనివారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్లాడు. రాత్రిఅయినా ఇంటికిరాకపోవడంతో తండ్రి చూసిచూసి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గ్రామశివారులోని పంట పొలంలో పడిఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా బురదలో మృతిచెంది కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ లక్ష్మణ్ సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

చొప్పదండి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఎనగందుల లక్ష్మణ్(65) అనారోగ్య సమస్యలతో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. పోలీసుల కథనంప్రకారం.. లక్ష్మణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడు లక్ష్మణ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భట్రాజు యువతను ప్రోత్సహించడమే లక్ష్యం



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భట్రాజు యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర భట్రాజు యువజన సంఘం అధ్యక్షుడు కూరపాటి నరసింహరాజు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రయువజనసంఘం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. భట్రాజు వివాహ పరిచయ వేదిక, స్పోర్ట్స్‌మీట్, మెగా జాబ్‌మేళా తదితర అంశాలపై చర్చించారు. కరీంనగర్ జిల్లా సంఘ భవనానికి సహాయ సహకారాలు అందించిన దాతలను, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు కూరపాటి నరసింహరాజు, జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు కృష్ణకాంత్‌రాజు, ప్రశాంత్‌రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజు సంఘ నాయకులు విజయ రఘురామరాజు, ఎన్వీడి ప్రసాద్‌రావజు, అనిల్ కుమార్‌రాజు, నవీన్ రాజు, విజయ్‌రాజు, కార్తీక్ రాజు పాల్గొన్నారు.

# భక్తుల కొంగు బంగారం సోమేశ్వరస్వామి

**● శ్రావణమాస పూజలకు ముస్తాబు**
**● సోమేశ్వర కొండపై సహజ సిద్ధ కోనేరు**
**● పర్యాటక కేంద్రంగా చేయాలంటున్న భక్తులు**


మల్లాపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కొలిచిన వారికి కొంగు బంగారంగా సముద్ర మట్టానికి 800 మీటర్ల ఎత్తులో మల్లాపూర్ మండల కేంద్రంలోని కొండపై శ్రీ కనక సోమేశ్వరస్వామి వెలిశారు. ప్రతీ ఏటా శ్రావణ, కార్తీక మాసాలతో పాటు శివరాత్రి పర్వదినాల్లో సోమేశ్వరాలయంతో పాటు కొండంతా భక్తులతో కిటకిటలాడుతుంది. గుట్టపైన గల సహజ సిద్ధ కోనేటిలో స్నానం చేస్తే నీరు ఔషధంగా పనిచేసి నొప్పులను మటమాయం చేస్తుందని పలువురు భక్తుల నమ్మకం. గర్భగుడిలోని స్వామికి భక్తులు అభిషేకం జరిపిన నీరు రాతి పొరలోంచి కొద్ది దూరం వెళ్లి ప్రత్యక్షం అవుతుంది. దీన్నే సోమ తీర్థం అంటూ భక్తులు పవిత్ర జలంగా స్వీకరిస్తున్నారు. కోనేటి నీటిని పొలంలో చల్లితే క్రిమి కీటకాలు దరిచేరవనే నమ్మకంతో రైతులు తీసుకెళ్తారు. భక్తులు కొండపైకి కాలి నడకన వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. కొండ మీదకు వెళ్లేందుకు రవాణా మార్గం కల్పిస్తూ సోమేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసం సోమవారం భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొని వరద పాయసాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. శివరాత్రి పర్వదినం మరుసటి రోజు స్వామి రథోత్సవం వైభవంగా జరుగుతుంది. కార్తీక పౌర్ణమిన రాత్రి జరిగే దీపోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ప్రతి సోమవారం కొండ కింద భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేస్తారు.



మల్లాపూర్‌లోని కనకసోమేశ్వర ఆలయం కోనేరు వద్ద భక్తులు



మల్లాపూర్‌లోని కనకసోమేశ్వర ఆలయం



మల్లాపూర్‌లోని కనకసోమేశ్వర ఆలయంలో శివలింగం

**కోరిన కోర్కెలు తీర్చే సోమేశ్వరుడు**

-బండారి రమేష్, భక్తుడు, మల్లాపూర్

గుట్టపైన గల శ్రీకనక సోమేశ్వరస్వామి భక్తుల కోరిక కోర్కెలు తీర్చుతాడని నమ్మకం. మల్లాపూర్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుంటారు. సోమవారం ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు జరుపుతారు.

**ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి**

-సంఘ గంగరాజం, ఆలయ కమిటీ చైర్మన్

ప్రతి సోమవారంతో పాటు ఇతర పర్వదినాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం శ్రావణ సోమవారం భక్తులు అధిక సంఖ్యలో స్వామికి వరద పాయసం పోస్తూ మొక్కులు చెల్లించుకుంటారు.

## ప్రమాదవశాత్తు రైలు కింద పడి మహిళ మృతి

అంతర్గాం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి వద్ద ప్రమాదవశాత్తు రైలు కింద పడి సిరిశెట్టి లక్ష్మి(64) అనే మహిళ ఆదివారం మృతి చెందింది. రామగుండం రైల్వే జీఆర్‌పీ ఇన్‌చార్జీ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం ఐటీసీ ఏరియా ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్ష్మి కూతురు ఇంటికి వెళ్లేందుకు కుందనపల్లికి వస్తుంది. అదే సమయంలో రైల్వే గేటు వేసి ఉండటంతో గేటు కింది నుంచి పట్టాలు దాటుతుండగా ఎగువ వైపు పట్టాలపై వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే జీఆర్‌పీ పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, భర్త నారాయణ ఉన్నారు.

## పెన్షన్ డబ్బులు పెంచి ఇవ్వాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

సిరిసిల్ల టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరిమహిళలు, నేత, గీతకార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెన్షన్ డబ్బులు పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం వీహెచ్‌పీఎస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఛలో హైదరాబాద్ మహాగర్జన జిల్లాస్థాయి సన్నాహక సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీనిఅమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ.20వేలకోట్లు కేటాయించిందని, ఆ రూపాయలు అత్యంత పేదవాలైన వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళల పెన్షన్ డబ్బులేనని అన్నారు. కాళ్లు, చేతులు లేని పేదవారి డబ్బులు తీసి భూములు ఉన్నవారికి ఇస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగులు, వృద్ధులు, వితంతులకు పెన్షన్ ఇవ్వాల్సిందేనని, చేతకాకుంటే రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంచి ఇస్తావా రాజీనామా చేస్తావా తేల్చుకోవడం కోసమే ఆగస్టు 13న చలో హైదరాబాద్ మహాగర్జన నిర్వహిస్తున్నామన్నారు. భూములు ఉన్నవారికి ప్రభుత్వం రుణమాఫీలు చేస్తుంది, రైతు భరోసా ఇస్తుంది కానీ కాళ్లు చేతులు లేని వికలాంగులకు పెన్షన్ పెంచి ఇవ్వడానికి మనస్సు రావడం లేదని అన్నారు. తాడోపేడో తేల్చుకోవడం కోసం పోరాటం తప్ప వేరేమార్గం లేదని ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చామన్నారు. వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరిమహిళలు, బీడీ,నేత,గీతకార్మికులు భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు గోపాల్, జాతీయ నాయకులు రాంబాబు, నాగేశ్వర్, జిల్లా కన్వీనర్ శోభారాణి, కోకన్వీనర్లు రవీందర్, సురేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం వాయిదా

● గతంలో అవినీతిపై చర్యలు తీసుకుంటాం

● బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సహకార అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం కోరం లేనందున వాయిదా పడినట్లు బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి గడ్డం విలాస్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్ తెలిపారు. టీఎన్‌జీఓస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సర్వసభ్యసమావేశం ఏర్పాటు చేయగా బ్యాంక్ అధికారులు, 2007-2017 మధ్య ఉన్న కమిటీసభ్యులు కోరంలేదని వాయిదా వేయాలని కోరడంతో ఆగస్టు 3న నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి మాట్లాడుతూ 2007నుంచి 2017వరకు దాదాపు 20 సర్వసభ్య సమావేశాలు జరిగాయని, ఏ సమావేశంలోనూ 50నుంచి 100మంది సభ్యులు హాజరుకాలేదని అన్నారు. అయినప్పటికీ అప్పుడు అధికారులు, పాలకవర్గ సభ్యులు అనేక తీర్మానాలు చేశారన్నారు. కరీంనగర్ జిల్లా అర్బన్ బ్యాంక్‌కు 1,800మంది సభ్యులున్నట్లు రికార్డులున్నాయని, 2009లో కరీంనగర్‌లోని కళాభారతిలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే 1,780మంది సభ్యులు హాజరైనట్లు తీర్మానంలో ఉందని అన్నారు. కళాభారతి సిట్టింగ్ కెపాసిటీ 250కాగా 1,780మంది సభ్యులను ఎక్కడ కూర్చోబెట్టారని ప్రశ్నించారు. దీనిపైన డీసీవోకు త్వరలో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. బ్యాంక్ బైలాస్ ప్రకారం బ్యాంక్‌లో ఖాతాదారుడికే సభ్యత్వం ఇవ్వాల్సి ఉండగా అప్పటిపాలకవర్గం అడ్డగోలుగా సభ్యత్వాలు ఇచ్చిందని ఆరోపించారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సభ్యత్వం ఇచ్చి దానిని సమర్థించుకునేందుకు 2009లో బైలాను మార్చిందన్నారు. 2007నుంచి 2017వరకు పాలకకమిటీ అనేక అవతవకలకు పాల్పడిందని ఆరోపించారు. బ్యాంక్ మెంబర్‌షిప్ లెడ్జర్‌లో సభ్యులపేర్లను మార్చారని, ఇతరరికార్డులను మాయం చేశారని మండిపడ్డారు. నకిలీ బంగారంతో రుణం ఇచ్చి ఒక అధికారిని సస్పెండ్ చేశారని, ఆ రుణానికి సంబంధించిన డబ్బులు రికవరీ చేయలేదని, ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేయలేదని అన్నారు. వీటిపై సహకార అధికారి లేఖ ద్వారా వారిపై చర్యకోసం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ నోటీసులు తిరస్కరించిన వారిపై చర్య తీసుకునేందుకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తే ఎక్కడ సభ్యత్వం కోల్పోతారోననే భయంతో సమావేశాన్ని వాయిదా వేయించారన్నారు. బ్యాంకుకుసంబంధించి అవినీతికి పాల్పడిన ప్రతీ ఒక్కరిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## గ్రామీణ మహిళల కోసం ఉల్లాస్


చొప్పదండిలో స్వయం సహాయక బృందం సమావేశం



ఉల్లాస్ యాప్ లోగో

● స్వయం సహాయక సంఘాల సభ్యుల అక్షరాస్యతకు శ్రీకారం

● ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరిక

చొప్పదండి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. చదువులేని మహిళలను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉల్లాస్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. మొదటి విడతలో స్వయం సహాయక సంఘంలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారిని అక్షరాస్యులను చేయాలని సంకల్పించి విద్య నేర్పే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర విద్య మంత్రిత్వశాఖ ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్‌ను తీసుకువచ్చింది.

● నిరక్షరాస్యుల గుర్తింపు

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో నిరక్షరాస్యుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించారు. చొప్పదండి మండలంలో 9,142 మంది మహిళలు స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్నారు. ఇప్పటి వరకు 642 మంది నిరక్షరాస్యులను గుర్తించి 186 మందిని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించారు. ఈ పథకం ద్వారా మహిళలకు రాయడం, చదవడం నేర్పిస్తారు. ప్రతి గ్రామానికి ఒక వలంటీర్‌ను నియమించారు. విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, ఐకేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నిరక్షరాస్యులను గుర్తించే ప్రక్రియ పూర్తికాగా అధికారులు ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమం నిర్వహణ కోసం వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయక గ్రూపుల్లో మహిళలు ఇప్పటి వరకు చదివిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. పదవ తరగతిలోపు చదివి మధ్యలో మానేసిన వారిని గుర్తించి ఓపెన్ టెన్త్‌లో చేర్పిస్తున్నారు. అదేవిధంగా పదవ తరగతి పాసై చదువు మానేసిన మహిళలను ఓపెన్ ఇంటర్‌లో చేర్పిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసిన వారిని డిగ్రీలో చేర్పించి డిగ్రీ పూర్తయిన తర్వాత సంఘం సభ్యులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా పథకాన్ని కొనసాగిస్తున్నారు. సంఘంలో చదివిన వారిని వలంటీర్‌గా నియమించి నిరక్షరాస్యులకు విద్య నేర్పిస్తున్నారు.

● నిర్వహణ కోసం కమిటీ

గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఆర్‌డీవోతోపాటు విద్యాశాఖ అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. మండలస్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ ఏపీఎం, గ్రామస్థాయిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, వీవోఏ అధ్యక్షురాలు, గ్రామ కార్యదర్శులకు బాధ్యతలను అప్పజెప్పారు. లక్ష్యాన్ని సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన ఉన్నతాధికారులు వందశాతం అక్షరాస్యత కోసం కృషి చేస్తున్నారు.

## ఎస్సారెస్పీకి పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 52,765 క్యూసెక్కుల నీరు రాక


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు భారీగా పెరిగింది. డ్యామ్‌లోకి రాత్రి 9 గంటల వరకు 52,765 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరినీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 24.655 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 622క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 13.045 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.099 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

## ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు

● అండర్-14, 19 విజేతగా శ్రీప్రకాష్ విద్యానికేతన్



చాంపియన్‌గా నిలిచిన శ్రీప్రకాష్ విద్యానికేతన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జగిత్యాలరోడ్ వివేకానంద రెసిడెన్షియల్‌పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగిన సీబీఎస్ఈక్లస్టర్-7 బాలుర కబడ్డీపోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కబడ్డీజట్టు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ ఎప్పటికప్పుడు శిక్షణపొందాలన్నారు. లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. వివేకానందపాఠశాల చైర్మన్ డాక్టర్‌పొల్సాని సుధాకర్‌రావు ప్రతిష్టాత్మక క్రీడలకు ఆతిథ్యంఇవ్వడం గర్వంగా భావిస్తున్నామన్నారు. కబడ్డీ ఐక్యత, సమభావనను పెంపొందిస్తుందన్నారు.

**విజేతలు వీరే..:** అండర్-14 విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ (పాయకరావుపేట) చాంపియన్‌గా నిలిచింది. వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి) ద్వితీయ, సూర్యచంద్ర ప్యాలెస్‌స్కూల్(వనపర్తి), శ్రీ విద్యాపీఠం(నార్కట్‌పల్లి) తృతీయస్థానాల్లో నిలిచాయి. అండర్-17 విభాగంలో వెరిటాస్ సైనిక్ స్కూల్(తిరుపతి) చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. శ్రీవిద్యాపీఠం(నార్కట్‌పల్లి)ద్వితీయ, సూర్యచంద్ర ప్యాలెస్ స్కూల్(వనపర్తి), ఎస్సార్‌విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్(గద్వాల్) తృతీయస్థానాల్లో నిలిచాయి. అండర్-19విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్(పాయకరావుపేట) చాంపియన్‌గా నిలవగా, సిస్టర్ నివేదిత స్కూల్(హైదరాబాద్)ద్వితీయ, వెరిటాస్‌సైనిక్ స్కూల్(తిరుపతి), హిల్స్ హైస్కూల్(నరసింగపాలెం) తృతీయస్థానాల్లో నిలిచాయి. చాంపియన్‌గా నిలిచినజట్లకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలకు ట్రోఫీలతోపాటు క్రీడల ప్రారంభం రోజున కరీంనగర్ కబడ్డీ అసోసియేషన్‌చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించిన నగదు బహుమతులను అతిథులుఅందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్రకబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లేశం, సీబీఎస్ఈ క్రీడల పరిశీలకుడు ఎల్.వెంకటరమణ, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి లలితకుమారి, ప్రిన్సిపాల్ బలివాడ రేణుక, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రశాంత్, హెడ్ మిస్ట్రెస్ అనిత, పాఠశాల సలహాదారుడు గంద్ర లక్ష్మణ్‌రావు, ఏవో చిత్తరంజన్ పాల్గొన్నారు.

## ఇంటర్ లాకింగ్ పనులు పూర్తి

● నేటి నుంచి యథావిధిగా రైళ్ల రాకపోకలు

పెద్దపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న బైపాస్ రైలుమార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చేపట్టిన ఇంటర్ లాకింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతో సోమవారం నుంచి యథావిధిగా భాగ్యనగర్, ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సింగరేణి, రామగిరి, కరీంనగర్ నుంచి సిర్పూర్ టౌన్ పుష్‌పుల్ ఎక్స్‌ప్రెస్ రైల్, బల్లార్షా నుంచి కాజీపేట నడిచే రైలు నడవనున్నాయి. పెద్దపల్లి బైపాస్‌వద్ద నిజామాబాద్ మార్గాన్నినేరుగా కాజీపేటమార్గంతో అనుసంధానం చేయనున్నారు. అలాగేబైపాస్ క్యాబిన్‌నుసైతం ప్రారంభించబోతున్నారు. పెద్దపల్లి బైపాస్ మార్గం నుంచి కాజీపేట్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే గూడ్స్ రైలు ఆదివారం నడిచింది. 4 రోజులుగా రైళ్ల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులుపడగా సోమవారంనుంచి రైళ్లుయథావిధిగా నడవనున్నాయి.



పెద్దపల్లి జంక్షన్ వైపు వస్తున్న రైలు


మొక్కలు నాటే ముందు కొబ్బరికాయ కొడుతున్న కలెక్టర్

## రాజన్న కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి: కలెక్టర్

వేములవాడ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలలోని కోడెల సంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ చూపించాలని రైతులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలనుంచి 85జతల కోడెలను సంబంధిత రైతులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసినకోడెలను కేవలం వ్యవసాయఅవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కోడెల స్థితిగతులపై ఆరాతీస్తారని తెలిపారు.

**వనమహోత్సవంలో పాల్గొన్న కలెక్టర్..**

రాష్ట్రదేవాదాయ, ధర్మదాయశాఖనేతృత్వంలో వనమహోత్సవంలో భాగంగా గోశాలఆవరణలో రోడ్డువెంట కొబ్బరిమొక్కలను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఈవో రాధాబాయి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్లు తదితరులు ఉన్నారు.

## బీడీ పరిశ్రమలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలను ఎత్తివేయాలి

● బీడీ కార్మికులకు రూ.4వేల పెన్షన్‌ను అమలు చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ


పాల్గొన్న బీడీ కార్మికులు

సిరిసిల్ల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నిరుపేద మహిళలు ఆధారపడి జీవిస్తున్న బీడీ పరిశ్రమలపై విధించిన ఆంక్షలను కేంద్రప్రభుత్వం ఎత్తివేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ డిమాండ్ చేశారు. సిరిసిల్లపట్టణంలో చేనేతవస్త్ర వ్యాపార సంఘ భవనంలో ఆదివారం సీఐటీయూ తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ 3వ మహాసభలు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సీఐటీయూ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు గోపాలస్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7లక్షలమంది కార్మికులు బీడీ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీడీ కార్మికులకు గతంలో కొనసాగిన గృహనిర్మాణ, పెన్షన్ ఇతర సంక్షేమ పథకాలను ఎత్తివేసిందన్నారు. వాటిని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులందరికి ఎలాంటి ఆంక్షలులేకుండా రూ.4వేల పెన్షన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్నా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం వెంటనే రూ.4వేల పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి మాట్లాడుతూ బీడీ కార్మికులను కంపెనీ యాజమాన్యాలు అనేకరకాలుగా దోపిడీకి గురిచేస్తున్నారని అన్నారు. కనీస వేతనంలో కోతలను విధిస్తూ నాణ్యమైన ఆకు, తంబాకు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తు న్నారన్నారు. జిల్లాలోని బీడీ కార్మికులందరు ఐక్యంగా సమస్యలపై పోరాటానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు.

ఈ మహాసభలో సీఐటీయూ జిల్లాకార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూషం రమేష్, సహాయకార్యదర్శులు సూరంపద్మ, గురజాల శ్రీధర్, డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి విమల, సీఐటీయూ నాయకులు శ్రీరాముల రమేష్‌చంద్ర, నక్క దేవదాస్, జిందం కమలాకర్, దాసరి రూప, బెజుగం సురేష్, బోనాల లక్ష్మి, లింగంపల్లి జ్యోతి, గురజాల మమత తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కోతుల బెడద

● ఇళ్లపై వానరాల గుంపులు

● పంటలు ధ్వంసం

● వృద్ధులు, చిన్న పిల్లలపై దాడులు

మానకొండూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోతుల బెడదతో జనం అవస్థలు పడుతున్నారు. పెద్ద సంఖ్యలో కోతులు ఇళ్లపై చేరడంతో భయాందోళన చెందుతున్నారు. చిన్న పిల్లలతో పాటు వృద్ధులపై దాడులు చేయడంతో తీవ్రంగా గాయాల పాలవుతున్నారు. మానకొం డూరు మండలంలో ప్రజలు కోతుల బెడదతో వణికి పోతున్నారు. గ్రామాలలోని గుట్టల్లో కోతులకు ఆహారం లభించకపోవడంతో ఇళ్లలోకి గుంపులు, గుంపులుగా వస్తూ ప్రజలను భయ పెడుతున్నాయి. ఇళ్లమీద చేర డమే కాకుండా ఇంట్లోకి వెళ్లి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తు న్నాయి. అడ్డుపడితే దాడికి దిగుతుండడంతో జనం ఆసుపత్రుల పాలవుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద కూరగాయలు సాగు చేస్తే మొత్తం ధ్వంసం చేస్తున్నాయి. రైతులు సాగు చేస్తున్న ఆరుతడి పంటలు వేరుశనగ, మొక్కజొన్న పంటలతో పాటు వరిని నాశనం చేస్తుండడంతో పెట్టుబడి రాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయాన్నే గ్రామాలలోకి వచ్చి గ్రామస్తులపైకి దాడికి దిగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


అన్నారంలోని ఇంటిపై ఉన్న కోతులు

● కోతుల దాడిలో నెలకు 80 మందికి చికిత్స

మండల కేంద్రం మానకొండూర్‌తో పాటు వెల్దిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఉన్నది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోజుకు ఇద్దరు చొప్పున కోతుల దాడికి గురైన వారు ఆసుపత్రికి వచ్చి చికిత్స చేసుకుంటున్నారు. గ్రామాలలో కోతులు ఎక్కువగా ఉండడమే కాకుండా దాడికి పాల్పడుతున్నాయని మందులను కూడా అందుబాటులో ఉంచి వైద్యం అందిస్తున్నట్లు మానకొండూర్ పీహెచ్‌సీ డాక్టర్ సల్మాన్ తెలిపారు.


లింగాపూర్-అన్నారం దారిపై అడ్డుగా ఉన్న కోతులు

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40వేల వరకు భక్తులు తరలివచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు ముందుగా రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఈసందర్భంగా భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం కోడె మొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయలోకి చేరు కుని పార్వతిరాజరాజేశ్వర స్వామివారలను దర్శించుకున్నారు. అనంతరంరాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కులను చెల్లించుకుని పరివార దేవతాలయాల్లో ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## ధర్మపురిలో భక్తుల ప్రత్యేక పూజలు


ధర్మపురి గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ధర్మపురి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో భక్తులు ఆదివారం పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోశారు. ఉగ్రనారసింహ స్వామి ఆలయంలో భక్త మండలి సభ్యులు, ఆర్య వైశ్యులు భక్తిపాటలు పాడుతూ భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, అభిషేక్ పౌరోహితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొర్లకాపరులకు ప్రభుత్వం అండగా ఉండాలి

ఇల్లంతకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గొర్లకాపరులకు ప్రభుత్వం అండగా ఉండాలని జాతీయ బీసీ యువజన సంఘ మండల అధ్యక్షుడు భూమల్ల ప్రశాంత్ ఒక ప్రకటనలో కోరారు. గొర్లకాపరులకు టార్పాలిన్లు, పశుగ్రాసం అందించాలన్నారు. గొర్రెలకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించాలని, గొర్లకాపరుల ప్రమాద బీమా రూ 5లక్షలకు పెంచాలన్నారు. గొర్లకాపరులకు గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగా గొర్రెలను కాకుండా నగదును బదిలీచేయాలని కోరారు.

## 'మన్ కీ బాత్' తిలకించిన బీజేపీ నాయకులు

కోనరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో ప్రధానమంత్రి మన్ కీ బాత్ 124 కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు తిలకించారు. మిరియాల బాలాజీ, కోనేటి రేణుక, జలంధర్, యశోద, రాజు, శంకర్, విజయ్, లచ్చిరెడ్డి, దామోదర్ రెడ్డి, ఎల్లయ్య, సుశాంత్ రెడ్డి, మారుతి, చరణ్, శ్రీహర్ష, విష్ణువర్ధన్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మన్‌కీ బాత్ 124వ ఎపిసోడ్‌ను వరినాట్లు వేసే కూలీలు ఆదివారం వీక్షించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో కూలీలు భోజన సమయంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పొలాల వద్ద ఫోన్‌లో ప్రత్యక్ష ప్రసార ఏర్పాటుచేసి వీక్షించారు. మోదీ చెప్పే మాటలను వింటూ భోజనం చేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన 'కొండూరి'

తంగళ్లపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ పడిగెల మానస, రాజు కుటుంబాన్ని నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మానస బంధువు అనిల్ మృతిచెందాడు. ఆయనతోపాటు ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు కందుకూరి రామగౌడ్, బండి జగన్ తదితరలు ఉన్నారు.

## నట్టల నివారణ మందు పంపిణీ చేయాలి..

తంగళ్లపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీచేయాలని మండల యాదవ సంఘం అధ్యక్షుడు బండి దేవేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లడుతూ గొర్రెలకు, మేకేలకు ఏడాదికి నాలుగుసార్లు నట్టల నివారణ మందులు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు పంపిణీ చేసేదని రెండు సంవత్సరాలుగా పంపిణీ చేయడం లేదన్నారు. దీంతో గొర్రెలు, మేకల పెంపకందారులపై తీవ్రభారం పడుతుందన్నారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో నట్టల నివారణ మందులు జీవాలకు నట్టల మందు వేస్తే ఆరోగ్యవంతంగా ఉంటాయని బరువు పెరిగి లాభదాయకంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

## అబ్దుల్ కలాంకు ఘన నివాళి

చందుర్తి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రం అమరవీరుల స్థూపం వద్ద రైతు సంఘం మండల అధ్యక్షులు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మర్రి రాములు, రవీందర్ రెడ్డి, లింగంపల్లి రాములు, బత్తుల వంశీ, బత్తుల శ్రవణ్, అక్కనపెల్లి రాజేందర్, మర్రి చిన్న రాములు పాల్గొన్నారు.

## గడపగడపకు ప్రభుత్వ పథకాలను చేర్చాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), జూలై27 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలలోని పల్లెలు, తండాల్లో గడపగడపకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను చేర్చి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు అనేక పథకాలను అందిస్తుంటే వాటిని ప్రజల వద్దకు చేర్చే బాధ్యత కార్యకర్తలదన్నారు.

## మత్తడి దూకుతున్న మసీద్ చెరువు

గంభీరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ మసీద్ చెరువు మత్తడి దూకుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కాలువల ద్వార వరద నీరు చెరువుల్లోకి వస్తున్నాయి. చింతల చెరువు మత్తడి దూకిన తెల్లారే మసీద్‌చెరువు మత్తడి దూకుతోంది. దీంతో బోదర కాలువ నుంచి నమాజ్ చెరువులోకి వరద నీరు వస్తోంది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

గంభీరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వర్షాల కారణంగా కూలిన ప్రతి ఇంటికి 4 వేల చొప్పున 15 మంది కుటుంబాలకు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, ఏఎంసీ డైరెక్టర్ ప్రబాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాంపెల్లి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ గౌరి శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, బాబు, యాదుల్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయానికి కుర్చీల వితరణ

ఇల్లంతకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) :మండలకేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి దాతలు ఆదివారం కుర్చీలను వితరణ చేశారు. కందికట్కూర్ గ్రామానికి చెందిన ముత్యం సతీష్‌గౌడ్, జవారిపేట గ్రామానికి చెందిన ముత్యం బాలగౌడ్‌లు 20కుర్చీలు, గ్రాండర్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు ఈదుల రవీందర్‌రెడ్డి, ఎర్రోజు గోపాలచారి, మంద చక్రాదర్‌రెడ్డి, తూముకుంట మోహన్‌రెడ్డి, ముంజ భూపతి, కొట్టి వెంకన్న, నాగసముద్రాల చారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

చందుర్తి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించిన వాహనాలు నడపవద్దని ఎస్సై రమేష్ అన్నారు. మండలంలోని ముడపల్లి గ్రామంలో కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై ఆదివారం ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో డ్రంక్ డ్రైవ్ పరీక్షలు, వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు.

## ఆలయ కమిటీ సభ్యుల ఔదార్యం..

ముస్తాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వర్షంలో చలికి వణుకుతూ మండల కేంద్రంలోని మడలేశ్వర ఆలయం పక్కన గడ్డిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని ఆలయ కమిటీ సభ్యులు ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. మాట్లాడలేని స్థితిలో చలికి వణుకుతూ కనిపించిన వ్యక్తిని గమనించిన కమిటీ సభ్యుడు శంకరయ్య దుప్పట్లు తెప్పించి కప్పారు. స్థానిక ఎస్‌ఐ గణేష్‌కు సమాచారం అందించగా హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య అక్కడకు చేరుకొని అతని పరిస్థితిని గమనించి 108కి సమాచారం అందించారు. అక్కడినుంచి 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు.

## రేణుకమాత యూత్ నూతన కమిటీ

గంభీరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్‌లో శ్రీ రేణుకమాత యూత్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు తిప్పపురం రాజుగౌడ్, అధ్యక్షులుగా గుర్రం సత్యానారాయణగౌడ్, ఉపాధ్యక్షులుగా ఎర్ర ప్రవీన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర సంతోష్‌గౌడ్, కోశాదికారిగా ఎర్ర చంద్రశేఖర్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా చెన్నగారి సాయికుమార్, బుచ్చగారి అక్షేష్‌గౌడ్, సలహాదారులుగా చెన్నగారి శరత్, పాపన్నగారి పర్శరాములు, కార్యవర్గ సభ్యులుగా ఎర్ర శ్రీనివాస్, దొంతగాని కిషన్‌గౌడ్, చెన్నగాని హేమంత్‌గౌడ్, బొల్గం సాయగౌడ్, ఎర్ర భరత్, ప్రణయ్, కరుణాకర్, శివ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

## కేసీఆర్ కిట్ల పంపిణీ

చందుర్తి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో రాష్ట్ర బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బర్త్ డే సందర్భంగా కేసీఆర్ కిట్లను ఆదివారం మహిళలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, నాయకులు పోతరాజు నగేష్, గుడిసె రమేష్, తిప్పనీ అజయ్,తిరుపతి, పోతరాజు నరేష్, ఏరెడ్డి రాజిరెడ్డి, తిప్పని రాజయ్య ,చింతం దేవయ్య, దుద్యాల లచ్చిరెడ్డి, మేకల పరంజ్యోతి, గంగాధర జీవన్, గంగాదర్, బొడ్డు దేవ మల్లు ,పోతరాజు నారాయణ ,మల్లేశం బొడ్డు బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మహాసభను విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణరంగ కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పండుగ శంకర్ ఒక ప్రకటనలో కోరారు. భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సిద్దిపేటలో మహాసభ జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల కార్మికులు హాజరై మహాసభలో పాల్గొనాలని పేర్కొన్నారు.

# అలంకారప్రాయంగా వైకుంఠధామం..

- చెరువు శిఖంలో నిర్మాణం - దహన సంస్కారాలకు తప్పని తిప్పలు



నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

తంగళ్లపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక సదుపాయలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామలు, కంపోస్టు షెడ్‌లు నిర్మించాలని సంకల్పించి నిదులు మంజూరుచేసింది. దీంట్లో భాగంగా తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామంలో వైకుంఠధామం, కంపోస్టు షెడ్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరుచేసింది. మూడేళ్ల క్రితం సుమారు రూ. 15 లక్షల వ్యయంతో బొంగురంకుంట శిఖంలో వైకుంఠధామం, పక్కనే కంపోస్టు షెడ్ నిర్మాణాలు చేపట్టారు. బొంగరంకుంట శిఖం అని తెలిసినా నిర్మాణానికి రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం, కంపోస్టు షెడ్‌లు ప్రారంభానికి నోచుకోక ముందే కుంటశిఖంలో నిర్మించడంతో నీట మునిగి ఉపయోగం లేకుండాపోయాయి. ఫలితంగా మూడేళ్లుగా వైకుంఠధామం నిరుపయోగంగా ఉంది.

### ముంపు అని తెలిసినా..

ముంపు అని తెలిసినా బొంగురంకుంట శిఖంలో లక్షల వ్యయంతో వైకుంఠధామం, కంపోస్టు షెడ్డులు నిర్మించారు. ప్రతి గ్రామంలో వైకుంఠధామం, కంపోస్టు షెడ్ల నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. టార్గెట్ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల వత్తిడి పెరగడంతో ముంపు అని తెలిసినా మండల రెవెన్యూ అధికారులు వైకుంఠధామానికి కుంట శిఖంలో స్థలం కేటాయించారు. గ్రామ పంచాయతీ పాలక వర్గం మౌనం వహించడంతో ముంపులో నిర్మాణాలు చేశారు. దీంతో వర్షకాలంలో కుంటలోకి నీరు చేరి ఆరు నెలలు వైకుంఠధామం, కంపోస్టు షెడ్డు నీళ్లలోనే మునిగి ఉండాల్సిన పరిస్థితి.

### దహన సంస్కారాలకు తిప్పలు..

లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం నీటిపాలవడంతో పద్మనగర్‌వాసులు దహన సంస్కారాల కోసం 3 కిలోమీటర్ల దూరంలో తంగళ్లపల్లి మానేరు నదికి వెళ్తున్నారు. నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన పద్మనగర్ అభివృద్ధి కోసం మంజూరైన నిధులను అధికారులు, పాలకులు సక్రమంగా వినియోగించకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు చొరవ తీసుకుని వైకుంఠధామం వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### మూడు కిలో మీటర్లు దూరం వెళ్లాలి..



- కుడిక్యాల కుమారస్వామి, పద్మనగర్

దహన సంస్కారాల కోసం మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న తంగళ్లపల్లి మానేరు నదికి వెళ్లాల్సి వస్తుంది. కుంట ముంపులో వైకుంఠధామం ఉండడంతో వినియోగించుకోలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

### ముంపునకు గురికాకుండా చర్యలు..



- లక్ష్మీనారాయణ, ఎంపీడీవో

భవిష్యత్తులో వైకుంఠధామం ముంపునకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం. మూడేళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. ముంపు లేనప్పుడు వినియోగించుకునేలా అవసరమైన అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం.

# అధ్వానంగా ప్రధాన రహదారులు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు.. - పట్టించుకోని అధికారులు..



గుంతలమయంగా మారిన సిరికొండ రోడ్డు

ఇల్లంతకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ప్రధానమైన రోడ్లు అధ్వానంగా మారిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు అయ్యాయని నాయకులు పేర్కొంటున్నారే తప్ప పనులు జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. ఇల్లంతకుంట నుంచి వెల్జిపూర్ మీదుగా జిల్లాకేంద్రానికి వెళ్లే రోడ్డుకు 2021లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన క్రింద రూ 4.50కోట్లు మంజూరయ్యాయి. కొంతమేర పనులు పూర్తి అయ్యాయి. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు వదిలి పెట్టి వెళ్లాడు. సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి స్థానిక నాయకులు తేవడంతో అధికారులు మాట్లాడి త్వరలోనే పనులు తిరిగి ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. నెలలు గడిచినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈరోడ్డుమీదుగా భారీ వాహనాలు వెళ్లడం వల్లనే రోడ్డు పూర్తిగా చేడిపోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పెద్దలింగాపూర్ నుంచి సిరికొండ, అనంతగిరి గ్రామాలకు వెళ్లే రోడ్డుపై అడుగడుకో గుంత ఉండటం వల్ల వాహనదారులు ఇబ్బంది పడటమే కాకుండా రాత్రివేళ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అనంతగిరి పోచమ్మతల్లి ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇల్లంతకుంట, వెంకట్రావుపల్లె గ్రామాల మధ్య రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయని పేర్కొంటున్నా పనులు కొనసాగడం లేదు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ళపొదలు, గుంతలతో ప్రయాణం కష్టంగా మారింది. మండలంలోని అన్ని ప్రధానమైన రోడ్లుతో పాటు అంతర్గత రోడ్లు పూర్తిగా చెడిపోయినందున ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులైన చేయించాలని ప్రజలు కోరుతున్నారు. మండలకేంద్రం నుండి కేవలం వంతడుపుల మీదుగా కరీంనగర్ వెళ్లే రోడ్డు మాత్రమే బాగుండగా ఇటీవల ఈ రోడ్డుపై భారీవాహనాలు వెళుతున్నాయని, ఈరోడ్డు కూడ తొందరలోనే పాడయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి..



- ఏగుర్ల శ్రీనివాస్, సిరికొండ

పెద్దలింగాపూర్ నుంచి సిరికొండ, అనంతగిరి గ్రామాలకు వెళ్లేదారిలో అడుగుకో గుంత ఉండటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలలో నీరుండటం వల్లవాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యాయని పేర్కొంటున్నారే తప్ప మరమ్మతులు చేపట్టడం లేదు. అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులు, ప్రజల ఇబ్బందులను గమనించి ప్రభుత్వం రోడ్లను బాగుచేయాలి.

### వాహనాలు నడపటం ఇబ్బందిగా మారింది



- మామిడి హరీష్, ఇల్లంతకుంట

మండలంలోని ప్రధానమైన రోడ్లు పూర్తిగా చెడిపోవడంతో వాహనాలు నడపటం ఇబ్బందిగా మారింది. వెల్జిపూర్ రోడ్డుకు నిధులు మంజూరైన పనులు కొంతమేర జరిగి, మిగతాపనులు చేపట్టకపోయినా ప్రభుత్వం స్పందించడం లేదు. జిల్లాకేంద్రానికి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే మిగతా రోడ్ల పరిస్థితి మరీదారుణంగా ఉంది. భారీ వాహనాలు వెళ్ళడం వల్లనే రోడ్లు పూర్తిగా చెడిపోయాయి. ప్రభుత్వం వెంటనే రోడ్ల మరమ్మతు చేపట్టాలి.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే అంతే..

- ఈ-చలాన్ ద్వారా భారీగా జరిమానాలు.. - అక్రమార్కుల ఆగడాలకు పోలీసుల చెక్



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు(ఫైల్)

సిరిసిల్ల క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనల అతిక్రమణపై ఈ-చాలన్ కేసులు పెట్టేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందుకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యాప్‌ను పోలీస్‌శాఖ రూపొందించింది. ఈ యాప్ ద్వారా కేసు నమోదైనా వ్యక్తుల ఆధార్ అనుసంధానంతో వెంటనే సంబంధిత వ్యక్తుల ఫోన్‌నంబర్ ద్వారా మెసేజ్ వెళుతుంది. దీంతో అక్రమార్కుల ఆగడాలపై ఎప్పటికప్పుడు చెక్ పెట్టే అవకాశం ఏర్పడింది. ట్రాఫిక్ నిబంధనలతోపాటు బహిరంగ మద్యం సేవించడమే కాకుండా ఇతరత్రా ఉల్లంఘనకు పాల్పడితే అక్కడే కేసు నమోదై చలాన్ ద్వారా జరిమానా విధిస్తారు. ఇలా అనేకమార్లు కేసులు నమోదై పట్టుబడితే జైలుకు వెళ్లక తప్పదు. ఈ-చలాన్ ద్వారా ద్వారా చిన్నచిన్న తప్పులు చేసిన వారు ఇక తప్పించుకోవడానికి వీలులేదు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు 13 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ప్రతిరోజు 500 ఈ-చలాన్ కేసులు నమోదుచేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. ఈ-చాలన్ పకడ్బందీగా అమలుపై రాజన్న సిరిసిల్లలో జిల్లాలో ప్రత్యేక దృష్టి పెట్టారు.

### నిబంధనలు పాటించాలి..

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడమే కాకుండా డ్రైవింగ్ చేసే వ్యక్తికి సరైన ధ్రువపత్రాలు లేకున్నా కేసు నమోదు చేస్తారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, స్పీడ్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్, రహదారులను ఆక్రమించి దుకాణాలు నెలకొల్పడంతో పాటు ఫుట్ పాత్‌లను ఆక్రమించినా కేసు నమోదవుతుంది. జూదం, పేకాట, మట్కా, గుట్కా ఇతరత్రా ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించి ఆడినా కేసు నమోదై ఈ-చలాన్ విధిస్తున్నారు. పట్టణాల్లో పబ్లిక్ న్యూసెన్స్ చేసినా, అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచి ఉంచినా, డీజే సౌండ్ వినియోగించిన స్థలంలోనే సంబంధిత వ్యక్తి ఆధార్‌కార్డు వివరాలతో కూడిన ఫొటోలు తీసి ఈ-చాలన్ ద్వారా ఇంటికి చేరుతుంది.

### స్పాట్‌లోనే జరిమానా..

ఈ-చలాన్ యాప్ ద్వారా స్పాట్‌లోనే కేసు నమోదు చేసి జరిమానా వేసే అవకాశం ఉన్నందున నిబంధనలు అతిక్రమించిన వారెవరైనా పైరవీలు చేయడానికి వీలు లేదు. పట్టుబడిన వెంటనే కఠినమైన చర్యలు తీసుకుంటారు. స్పాట్‌లోనే ఈ-చలాన్ ద్వారా కేసు పెట్టి జరిమానా విధిస్తారు. ఇప్పటివరకు పెట్టీ కేసులు నమోదైన వారు మళ్లీ మళ్లీ నిబంధనలు ఉల్లఘిస్తున్నారు. ఈ కేసుల్లో తరచుగా ఇరికితే జైలు ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుంది. ఒక చోట ఈ-చలాన్ కేసు నమోదైతే ఆ వివరాలన్నీ అన్ని పోలీస్ స్టేషన్‌లకు చేరే విధంగా అనుసంధానం చేశారు. గతంలో ఏదైనా వాహనం పట్టుబడితే వెంటనే పైరవీ చేసి విడిపించుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పైరవీలకు తావుండదు.

### ట్యాబ్‌ల ద్వారా క్లిక్..

నేరాలను నియంత్రించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంను వినియోగించే విధంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ట్యాబ్‌లు అందజేశారు. ఈ ట్యాబ్‌ల ద్వారా వాహనదారుడికి తెలియకుండానే క్లిక్‌మనిపిస్తారు. ఇందులో భాగంగానే జిల్లా ఐటీకోర్ సిబ్బంది పోలీసు అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ అప్లికేషన్‌లో ఏ విధంగా పెట్టీ కేసులు అప్‌లోడ్ చేయాలో వాటిని ఎలా ఉపయోగించాలో సమగ్రంగా తెలియజేశారు. ఈ ట్యాబ్‌ల ఆధారంగా డిజిటల్ టెక్నాలజీ ద్వారా యాప్‌ను ఉపయోగించి కేసు పెడుతారు. పబ్లిక్ న్యూసెన్స్‌కు సంబంధించిన సంఘటనపై స్పాట్‌లోనే ట్యాబ్‌లో యాప్ అప్లికేషన్ ఓపెన్‌చేసి ఈ-చలాన్ ద్వారా కేసు పెడుతారు. ఇపుడు ట్యాబ్‌లు పోలీసు శాఖకు ఎంతో ఉపయోగపడుతుంది. స్పాట్‌లోనే సంఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు తీయడమే కాకుండా ఇతరత్రా అన్నింటికీ ట్యాబ్‌లు ఉపయోగపడుతన్నాయి. నేరం చేసిన వ్యక్తులకు సంబంధించిన వివరాలు పొందుపరచడానికి వీలుంది. ఈయాప్ నేరాలను నియత్రించేందుకు దోహదపడుతుంది.

### ఈ-చలాన్‌లతో నేరాల అదుపు..

- మహేశ్ బి. గీతే, ఎస్పీ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అదుపుచేయడానికి సులభమవుతుంది. బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ఎంతో ఉపయోగపడుతుంది. నిబంధనలు అతిక్రమిస్తే అక్కడికక్కడే ఈ-చలాన్ ద్వారా కేసులు పెడుతారు. ఈ అప్లికేషన్‌లో పొందుపరిచిన వివరాలు భద్రంగా ఉంటాయని, మరెపుడైనా ఆ వ్యక్తి ఏ నేరానికి పాల్పడినా కేసును ఛేదించడం సులభం అవుతుంది. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుంది.

## కేంద్ర మంత్రి సమక్షంలో బీజేపీలో చేరిక



బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

ఇల్లంతకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన వివిద పార్టీల నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరగా కరీంగనర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లాల అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు అడిచెర్ల రాజు, సామ బాల్‌రెడ్డి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, స్వామి, చింతలపెల్లి రాజిరెడ్డి, తిప్పారం శ్రావణ్, ప్రసన్న, మధు, నరేష్, కాట్నపెల్లి రవీందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చి రొట్ట సాగుపై రైతుల ఆసక్తి..



సుద్దాలలో సాగుచేసిన పచ్చి రొట్ట

కోనరావుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి భూసారాన్ని పెంచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే అధిక మోతాదులో ఎరువులు వాడటంతో భూసారం తగ్గి దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈక్రమంలో పచ్చిరొట్ట పెంపకం, పశువులు, కోళ్ల పేడ, సేంద్రియ ఎరువులతో పాటు పలు గ్రామాల్లో రైతులు పచ్చిరొట్ట ఎరువు వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు అవగాహన కల్పిస్తుండటం సత్ఫలితాన్నిస్తోంది. పదివేలకు పైగా ఎకరాల్లో పచ్చిరొట్ట మండలాలకు పంపిణీచేశారు. పచ్చిరొట్ట కోసం అధికారులు 4800క్వింటాళ్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, సుమారు 1200 క్వింటాళ్ల మేర సరఫరా అయింది. వీటిని 13 మహిళా సంఘాల సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంపిణీ చేశారు. జిల్లాలో 10వేలకు పైగా ఎకరాల విస్తీర్ణంలో పచ్చిరొట్ట సాగు చేశారు. 30 కిలోల బస్తాలను జిల్లాలో ఈ వానాకాలంలో 1.70 లక్షల ఎకరాల్లో వరి ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందజేసింది. 17వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

### పచ్చరొట్టతోనే భూసారం పెరుగుతుంది.



- రొక్కం రాగవ్వ, రైతు, మంగళపల్లె

గతంలో రసాయనిక ఎరువులు ఎక్కువ వాడే వాళ్ళం. కానీ అధికారుల సూచనల మేరకు సేంద్రియ ఎరువులు ఎక్కువ వాడుతున్నాం. పచ్చరొట్ట పొలాల్లో చల్లి ఏపుగా పెరిగిన తర్వాత కలియ దున్నడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

## మళ్లీ వ్యవసాయ యాంత్రీకరణ..

(5వ పేజీ తరువాయి)

పెట్టుకొని 15రకాల యంత్ర పరికరాలను అందించడానికి జాబితాను రూపొందించారు. ఇందులో రోటవేటర్‌లు, నాగళ్లు, కల్టివేటర్, స్ప్రేయర్లు, పవర్‌టిల్లర్లు, డ్రోన్స్, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, బండ్ ఫార్మార్, బ్యాటరీ ఆపరేటెడ్ స్ప్రేయర్లు వంటివి అందించనున్నారు.

### రైతుల్లో హర్షం...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో దాదాపు 4.14 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. వానాకాలం సీజన్‌లో 2.43 లక్షల ఎకరాలు, యాసంగిలో 1.74 లక్షల ఎకరాల వరకు వివిధ పంటలు సాగు చేస్తారు. వ్యవసాయ కూలీల కొరతతో ప్రతి సీజన్‌లోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీపై యంత్రాలు ఇవ్వడం ద్వారా ఇబ్బందులు తొలగుతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యవసాయ పరికరాల కొనుగోలు చేయాలంటే పెద్దమొత్తంలో ఖర్చు అవుతుంది. కల్టివేటర్ బయట తయారు చేస్తే రూ.30 నుంచి రూ.50 వేలు, రోటవేటర్ కొనాలంటే రూ.లక్ష వరకు ఖర్చుఅవుతుంది. పురుగుల మందు పిచికారి యంత్రాల ధర మార్కెట్‌లో రూ.3 వేల నుంచి రూ.పది వేల వరకు ఉన్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా సగం ధరకే పరికరాలు రానుండడంతో చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది.

### లబ్ధిదారుల ఎంపిక కష్టమే..

వ్యవసాయ అధికారులకు వ్యవసాయ పరికరాలు అందించడం ఎలా ఉన్నా లబ్ధిదారులను ఎంపికచేయడం కత్తిమీద సాములాగే మారుతుంది. మహిళా రైతుల నుంచి పోటీ ఉండడమే కాకుండా రాజకీయ జోక్యం కూడా పెరుగుతుంది. అధికార పార్టీ చెందిన వారి ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు.

## 'వర్గమూలం' పుస్తకావిష్కరణ..



కవితా సంకలాన్ని అవిష్కరిస్తున్న డాక్టర్ నలిమెల భాస్కర్,జూకంటి జగన్నాథం తదితరులు

సిరిసిల్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన కవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట లక్ష్మణ్ వెలువరించిన 'వర్గమూలం' కవితా సంపుటి ఆవిష్కరణ ఆత్మీయుల మధ్య జరిగింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని మాన్య ఫంక్షన్ హాల్లో కవితా సంపుటి పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, రచయిత, దాశరథి అవార్డు గ్రహీత జూకంటి జగన్నాథం, రంగినేని ట్రస్ట్ చైర్మన్ రంగినేని మోహన్‌రావు, డాక్టర్ సత్యనారాయణ స్వామి, డాక్టర్ ఎన్వీ రమణారావు డాక్టర్ శ్రీవాణిలు పుస్తకాన్ని ఆవిష్కరించి లక్ష్మణ్‌ను అభినందించారు. మద్దికుంట లక్ష్మణ్, లక్ష్మీ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా నలిమెల భాస్కర్ మాట్లాడుతూ ఉన్నంతలో సాటి మనిషికి సాయం చేయని బతుకు నిరర్థకం అన్నారు. లక్ష్మణ్‌లో సాహిత్య కోణం కన్నా ఎదుటివారికి సాయపడాలనే మంచితనమే కనిపిస్తుందన్నారు. కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ మంచి కవిత్వం రాసేవాళ్ళు రాయకుంటే నాసిరకం కవిత్వం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణారావు, డాక్టర్ శ్రావణ్ సూరజ్, స్ఫూర్తి, లోహిత్, డాక్టర్ లికిత తదితరులు పాల్గొన్నారు.

### ఆకుపచ్చ పాట, గోటీలాట పుస్తకాల ఆవిష్కరణ..

కాగా, సిరిసిల్లకు చెందిన బాల సాహితీవేత్త, మారసం వ్యవస్థాకులు డాక్టర్ పత్తిపాక మోహన్ రచన తెలుగు బాలగీతాలు 'ఆకుపచ్చపాట', బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ రాసిన పిల్లల కథలు 'గోటీలాట'ల పుస్తకాలను ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ పూర్వఅధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, బాల వికాసకారులు మాడభూషి స్మారక సమితి అధ్యక్షురాలు మాడభూషి లలితాదేవిలు ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు బాల సాహితీ లోకంలో విశేష కృషిచేస్తున్న పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్‌లు మరింత కృషి చేయాలని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో అతిథులుగా డాక్టర్ అమరవాది నీరజ, డాక్టర్ అమ్మిన శ్రీనివాస రాజు, శీలా సభద్రాదేవి, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.